
ప్రజాశక్తి
శుక్రవారం 13 డిసెంబర్ 2024




పెంచిన విద్యుత్ ఛార్జీల భారాన్ని వ్యతిరేకిస్తూ బిల్లులు దగ్ధం చేస్తున్న సిపిఎం నాయకులు

వాణిజ్యానికీ బాదుడే..



> పత్తికొండ పట్టణంలోని ఓ కిరాణం దుకాణానికి అక్టోబర్ నెలలో 118 యూనిట్లకు రూ.538 విద్యుత్ బిల్లు రాగా ఈ నెలలో 111 యూనిట్లు విద్యుత్ వినియోగించినా రూ.578 బిల్లు వచ్చింది. తక్కువ విద్యుత్ వినియోగించినా బిల్లు మాత్రం పెరిగింది. అందులో ఎఫ్‌పిపిసిఎ (2022-04) పేరుతో రూ.75.05, ఎఫ్‌పిపిసిఎ (2024-10) పేరుతో రూ.50.40, ట్రూ అప్ పేరుతో రూ.12.18 బిల్లు వేశారు. ఎనర్జీ ఛార్జీలు రూ.354 కాగా మిగిలిన రూ.224 అదనంగా వేసిన బాదుడే..



ట్రూ అప్, ఎఫ్‌పిపిసిఎ పేరుతో వడ్డన

తక్కువ విద్యుత్ వాడినా ఎక్కువ బిల్లు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

విద్యుత్ బిల్లులు చూసి దుకాణ దారులు, వ్యాపారస్తులు హడలి పోతున్నారు. అప్పుడు వైసిపి.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం తమపై విద్యుత్ భారాలు మోపుతూ వికట్టహాసం చేస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. గతేడాది వాడుకున్న విద్యుత్‌కు సంబంధించి ప్రభుత్వం ప్రజలపై ట్రూఅప్, సర్దుబాటు భారం మోపింది. డిసెంబర్‌లో ఇస్తున్న బిల్లుల నుంచి ఈ బాదుడు మొదలుపెట్టింది. జనవరిలో అదనంగా మరో ఛార్జీ మోతకు ఇప్పటికే అన్నీ సిద్ధం చేసింది. దీంతో జనానికి ఏం చేయాలో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 4 లక్షల వరకూ గృహ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. విద్యుత్ బిల్లుల పేరుతో ప్రభుత్వాలు జనాన్ని పీక్కుతింటున్నాయి. వాడుకున్న కరెంటుకు కాకుండా ఫిక్స్‌డ్ ఛార్జీ, కస్టమర్ ఛార్జీ, ఇడి, సర్‌ఛార్జి, ఇడి ఐఎన్‌టి, ఎఫ్‌పిపిసిఎ, ఎఫ్‌పిపిసిఎ2 ఛార్జీల పేరుతో వీర బాదుడు బాదుతోంది. వాడుకున్న కరెంటుకు, వస్తున్న బిల్లుకు సంబంధం లేకుండా పోయిందని లబ్ధిదారులు వాపోతున్నారు. శీతాకాలంలో విద్యుత్ వాడకం తక్కువగా ఉంటుంది. ఇప్పుడు ఇంత పెద్ద మొత్తంలో బిల్లు వస్తే వేసవిలో పరిస్థితి ఏమిటనే భయం అందరినీ వెంటాడుతోంది. చిరు వ్యాపారులు సైతం కరెంటు బిల్లులు చూసి గుండెలు బాదుకుంటున్నారు. దీంతో ఆ భారం సైతం జనాలపై పడనుంది. విద్యుత్ భారాల విషయంలో ప్రభుత్వం తీరు సర్వత్రా చర్చ నీయాంశంగా మారింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యుత్ ఛార్జీల పెంపుదలపై అప్పటి వైసిపి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసిన టిడిపి, బిజెపి, జనసేన, ఇప్పుడు కూటమి కింద అధికారంలోకి వచ్చిన తర్వాత మరింత దారుణంగా వ్యవహరిస్తున్న పరిస్థితి కన్పిస్తోంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా.. అధికారంలోకి వచ్చాక మరోలా రాజకీయ పార్టీలు వ్యవహరిస్తున్నాయనే చర్చ జనాల్లో సాగుతోంది. వ్యాపారస్తుల్లో ఆదాయాల్లో మాత్రం పెరుగుదల ఉండటం లేదు. ఒక వైపు వ్యాపారాలే సరిగా సాగని పరిస్థితి నెలకొందని, మరో వైపు విద్యుత్ చార్జీల బాదుడుతో దుకాణాలను, వ్యాపారాలను మూసు కోవాల్సిన పరిస్థితి ఎదురవు తుందని చెబుతున్నారు. ముందు ముందు వ్యాపారాలు కొనసాగించే పరిస్థితి ఉండదని ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ ఛార్జీల పెంపుతో సామాన్య ప్రజానీకంతో పాటు దుకాణదారులు కూడా విలవిల్లాడుతున్నారు. పెను భారాలు మోపుతూ పాలకులు వ్యవహరిస్తున్న తీరుపై జనాగ్రహం పెల్లుబికుతోంది. వైసిపి ఓటమికి ప్రధాన కారణం తొమ్మిదిసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచడమే. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే అదనపు ఛార్జీల పేరుతో రెండుసార్లు విద్యుత్ ఛార్జీల మోత మోగించింది. దీంతో కూటమి ప్రభుత్వంపై జనాల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.



భారాలు మానుకోవాలి

నేను చిన్నపాటి హోటల్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాను. గత నెల ఎక్కువ కరెంటు వాడినా రూ.360 బిల్లు వచ్చింది. ఈ నెల తక్కువ కరెంటు వాడినా రూ.441 బిల్లు వచ్చింది. విద్యుత్ ఛార్జీలు పెంచి సామాన్యులపైన, మా లాంటి చిన్న వ్యాపారస్థుల మీద ప్రభుత్వం భారం వేస్తోంది. ఈ భారాలను వేయడం ప్రభుత్వం మానుకోవాలి.

- ఉల్చాల రామకృష్ణ, హోటల్ యజమాని, గోనెగండ్ల.

ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలి

- సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులు దహనం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను, ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పిఎస్.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. విద్యుత్ ఛార్జీల భారాన్ని వ్యతిరేకిస్తూ గురువారం కర్నూలు నగరంలోని సుందరయ్య సర్కిల్‌లో సిపిఎం న్యూ సిటీ కమిటీ కార్యదర్శి టి.రాముడు అధ్యక్షతన విద్యుత్ బిల్లులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు ఎన్నో ఆశలతో గెలిపించుకున్న టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడవకముందే విద్యుత్ చార్జీల పేరుతో రూ. 20 వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపుతూ స్వర్ణాంధ్ర నిర్మిస్తామని చెప్పడం హాస్యాస్పదగా ఉందన్నారు. గత రెండు నెలలుగా విద్యుత్ చార్జీల భారం భారీగా పెరిగిందని చెప్పారు. గత ప్రభుత్వానికి లంచాలు ఇచ్చి అదాని కుదుర్చుకున్న విద్యుత్ ఒప్పందాలను ఎందుకు రద్దు చేయడం లేదని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేంద్రంలో నరేంద్ర మోడీ, రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అదాని భజన బృందాలుగా మారాయని విమర్శించారు. వెంటనే అదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.నరసింహ, వై.నగేష్. నగర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ సాయిబాబా, నగర నాయకులు ఎస్ .మొహమ్మద్ రఫీ, ఎంసీ.ఆనంద్, అబ్దుల్లా, బతుకన్న, దస్తగిరి, అశోక్, గోపాల్, హుస్సేన్, కుమార్, శివ, చిన్న వ్యాపారస్తుల సంఘం కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. **కర్నూలు హాస్పటల్ :** పెంచిన ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో ముజఫర్ నగర్ 81, 82 సచివాలయం ముందు విద్యుత్ బిల్లులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుధాకరప్ప మాట్లాడుతూ గతంలో ప్రపంచ బ్యాంకు విధానాలకు అనుకూలంగా చంద్రబాబు కరెంటు చార్జీలు పెంచిన సందర్భంగా కరెంటు ఉద్యమం వల్ల పదవిని కోల్పోయి పది సంవత్సరాలు ఇంటి దగ్గర ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని, మళ్లీ ఆ పరిస్థితి రాకుండా ఉండాలంటే వెంటనే ట్రూ ఆఫ్ చార్జీలను ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఖలీల్ అహ్మద్, కాశన్న, మాదన్న మహిళా సంఘం నాయకురాలు ఈశ్వరమ్మ, కుమారి, లక్ష్మీదేవి, సురేఖ, సలోమి, ఖరీఫా, విజయ, రఫియా తదితరులు పాల్గొన్నారు.


బిల్లులు దగ్ధం చేస్తున్న నాయకులు, మహిళలు

నేడు విజన్ డాక్యుమెంట్ సదస్సు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ముఖ్యమంత్రి స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్‌ను 13న విజయవాడలో ఆవిష్కరించ నున్న నేపథ్యంలో జిల్లా నుండి యూనివర్సిటీ ప్రొఫెసర్లు, పారిశ్రామిక వేత్తలు, స్వయం సహాయక సంఘాల మహిళలు, రైతులు పలువురు గురువారం విజయవాడకు తరలివెళ్లారు. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన బస్సులను కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య జెండా ఊపి సాగనంపారు. జెసి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించనున్నారన్నారు. అక్కడ నిర్వహించనున్న కార్యక్రమానికి జిల్లా నుండి 5 ఆర్టీసీ బస్సుల్లో, 4 టెంపో వాహనాల్లో వివిధ శాఖల సిబ్బంది, వివిధ యూనివర్సిటీల ప్రొఫెసర్లు, పారిశ్రామిక వేత్తలు, స్వయం సహాయ సంఘాల మహిళలు వెళ్లారన్నారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే వారికి తగిన పాసులు అందించామన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ సి.వెంకట నారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అజయ్ కుమార్, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, కర్నూలు అర్బన్ తహశీల్దార్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



బస్సును ప్రారంభిస్తున్న జెసి

అనాథ పిల్లలకు పింఛను

- కలెక్టర్ ప్రతిపాదనకు సిఎం అంగీకారం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

తల్లిదండ్రులు ఇద్దరూ చనిపోయి అనాథలుగా మారిన పిల్లలకు పింఛన్ మంజూరుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు తెలిపారు. గురువారం అమరావతిలో నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో పింఛన్ల అంశంపై జరిగిన చర్చ సందర్భంగా కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఈ అంశాన్ని లేవనెత్తారు. ఆస్పత్రుల్లో ప్రసవ సమయంలో తల్లి చనిపోయి అనాథగా మారిన పిల్లలకు, ప్రమాదాల్లో తల్లిదండ్రులు చనిపోయి అనాథలైన పిల్లలకు, పాక్షికంగా అనాథలైన పిల్లలకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద పింఛన్ మంజూరు చేస్తే వారికి కొంత ఉపశమనం కలుగుతుందని కలెక్టర్ ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. మిషన్ వాత్సల్య కింద వీరికి 3 ఏళ్ల దాకా మాత్రమే కొంత సాయం అందుతోందని కలెక్టర్ వివరించారు. భర్త చనిపోయిన వెంటనే అతని భార్యకు వితంతు పింఛన్ మంజూరు చేయాలని, కలెక్టర్ల మొదటి కాన్ఫరెన్స్‌లో తాను ముఖ్యమంత్రిని కోరిన వెంటనే ఉత్తర్వులు జారీ చేశారని కలెక్టర్ ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.


సదస్సులో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

తల్లీబిడ్డ మృతిపై విచారణ

ప్రజాశక్తి - పత్తికొండ

పత్తికొండ పట్టణంలో తల్లీ బిడ్డ మృతి చెందిన ఘటనపై ఆదోని డిప్యూటీ డిఎంహెచ్ఒ సత్యవతి గురువారం విచారణ చేపట్టారు. పత్తికొండ ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను సందర్శించి ఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ డిఎంహెచ్ఒ విలేకరులతో మాట్లాడుతూ పత్తికొండ పట్టణానికి చెందిన గర్భవతి మౌనిక గత నెల 30న ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ప్రసవం కోసం వచ్చారని, ఆ రోజు గైనకాలజిస్ట్ సెలవులో ఉండడంతో డ్యూటీ డాక్టరే చికిత్స అందించారని అన్నారు. గర్భవతి మౌనిక పురిటి నొప్పులు భరించలేక ఇబ్బందులు పడ్డారని అన్నారు. మౌనికను బంధువులు ప్రభుత్వ ఆసుపత్రి నుండి ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారని, అక్కడ మగ బిడ్డకు జన్మనివ్వగా అప్పటికే బిడ్డ మృతి చెందాడని, మౌనిక ఆరోగ్యం బాగోలేదని ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యం కర్నూలుకు రెఫర్ చేశారని అన్నారు. మార్గమధ్యలో మౌనిక కూడా మృతి చెందినట్లు తెలిపారు. మౌనిక మృతిపై జిల్లా వైద్యాధికారులకు నివేదికలు అందజేస్తామని అన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఉమాదేవి, విజయరాజు, పత్తికొండ మెడికల్ ఆఫీసర్ సుజాత పాల్గొన్నారు.


విచారిస్తున్న ఆదోని డిప్యూటీ డిఎంహెచ్ఒ

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

- నాలుగో రోజు కొనసాగిన మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరపాలక సంస్థలో ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని మున్సిపల్ ఇంజనీరింగ్ సెక్షన్ కార్మికులు నాలుగో రోజు సమ్మెలో భాగంగా మున్సిపల్ కార్యాలయం నుండి ర్యాలీగా పాత బస్టాండ్ వరకు వెళ్లి అక్కడ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడి నుండి ర్యాలీగా మునిసిపల్ ఆఫీస్‌కు వచ్చి టెంట్‌లో కూర్చొని సమ్మె నిరసన కొనసాగించారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈ నిరసన కార్యక్రమం చేస్తున్నామని, ప్రభుత్వం దిగివచ్చి మాకు న్యాయం చేసే వరకు నిరసనను కొనసాగిస్తామని తెలియజేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.మనోహర్, జిల్లా అధ్యక్షులు, నగర అధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, కె.జ్ఞానమ్మ, ఎస్.షేక్షావలీ పాల్గొన్నారు.

అంగన్వాడీల డిమాండ్లు పరిష్కరించాలి

- పిడికి సిఐటియు సిఐటియు, ఎఐటియుసి వినతి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

అంగన్వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేసిన సందర్భంగా ఉన్న డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని అంగన్వాడీ ఐసిడిఎస్ పిడి వెంకట లక్ష్మికి అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలలితమ్మ, జిల్లా కార్యదర్శి చౌడేశ్వరి ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప, నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, రాష్ట్ర నాయకులు నిర్మలమ్మ, జిల్లా కార్యదర్శి వెంకటమ్మ, సిఐటియు నగర నాయకులు మహమ్మద్ రఫీ వినతి పత్రం సమర్పించారు.

లైంగిక వేధింపులకు పాల్పడడం నేరం

- సిఐ ఆదిలక్ష్మి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడడం నేరమని సిఐ ఆదిలక్ష్మి అన్నారు. గురువారం నగరంలోని స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో విధి నిర్వహణ ప్రదేశంలో లైంగిక వేధింపుల నిరోధ అవగాహనా వారోత్సవాల సందర్భంగా అవగాహన సదస్సును నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ ఇందిరశాంతి అధ్యక్షతన జరిగిన సదస్సుకు ముఖ్యఅతిథిగా సిఐ ఆదిలక్ష్మి మాట్లాడారు. విధి నిర్వహణ ప్రదేశంలో సహోద్యోగులుగా, విద్యాలయాల్లో సహ విద్యార్థులుగా పురుషులు ఉండడం సహజమని తెలిపారు. 21వ శతాబ్దంలో కూడా ఈ అవకాశాన్ని దుర్వినియోగం చేస్తూ ఉద్యోగినులు, విద్యార్థుల పట్ల లైంగిక వేధింపులకు పాల్పడడం నేరమని తెలిపారు. ప్రతీ మహిళలో తమ తల్లిని, చెల్లిని చూడగలిగితే ఇటువంటి పొరపాట్లు జరగవని తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్స్ జె.హేమంత్, ఎ.సత్యనారాయణ, కళాశాల మహిళా సాధికారత విభాగం కన్వీనర్ ఎస్.షాజిదాబీ, కళాశాల కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.ఫక్రున్నిసా బేగం, ఇంటర్నిప్ కన్వీనర్ టి.మాదన్న మాట్లాడారు.


మాట్లాడుతున్న సిఐ ఆదిలక్ష్మి

రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తాం

- ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రెవెన్యూ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి తెలిపారు. గురువారం ఓర్వకల్లు మండలంలోని కాల్వ గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, టిటిడి బోర్డు మెంబర్, టిడిపి నంద్యాల పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్, తహశీల్దార్ విద్యాసాగర్ హాజరయ్యారు. పలువురు రైతులు, ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో అనేక భూ సమస్యలు నెలకొన్నాయని తెలిపారు. వీటిని పరిష్కరించేందుకు సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఇక్కడ వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరిస్తామని చెప్పారు. **కోడుమూరులో** ఏర్పాటుచేసిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పాల్గొన్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో భూముల్లో జరిగిన అవకతవకలతో రైతులు ఇబ్బంది పడుతున్నారని, వాటి పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తహశీల్దార్ వెంకటేష్ నాయక్, డిప్యూటీ తహశీల్దార్ రామాంజనేయులు, స్పెషల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్ఐ ఎపి.శ్రీనివాసులు, సర్పంచి భాగ్యరత్నమ్మ, ఎడిఎ శాలు రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

ప్రజలు సంతృప్తి చెందేలా పనిచేయండి

- సచివాలయాల్లో నగరపాలక కమిషనర్ తనిఖీ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ప్రభుత్వ సేవల కోసం సచివాలయాలకు వచ్చే ప్రజలు సంతృప్తి చెందేలా సిబ్బంది పనిచేయాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు సూచించారు. గురువారం ఎన్.ఆర్. పేటలోని 125, 126వ సచివాలయాలను కమిషనర్ ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టిక, మూమెంట్ రిజిస్టర్లను కమిషనర్ పరిశీలించారు. ఎంఎస్ఎంఈ సర్వే, పన్ను వసూళ్ళపై కమిషనర్ ఆరా తీశారు. సచివాలయానికి వచ్చే ప్రతి పౌరుడు సంతప్తి చెందేలా సేవలు అందించాలని, కష్టతరమైన పనులు ఉంటే, జాప్యం చేయకుండా వెంటనే సంబంధిత అధికారుల దష్టికి తీసుకెళ్ళాలని పేర్కొన్నారు. సచివాలయం, పరిసర ప్రాంతం తప్పనిసరిగా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే జిల్లా కోర్టు, మున్సిఫ్ కోర్టుల ప్రాంగణాలను కమిషనర్ పరిశీలించారు. న్యాయవాదుల అభ్యర్థన మేరకు పార్కింగ్, ఫుట్‌పాత్, పారిశుద్ధ్య పనులకు సంబంధించి పలు ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కొండా రెడ్డి బురుజు, పెద్దమార్కెట్, జమ్మిచెట్టు ప్రాంతాల్లో కమిషనర్ పారిశుధ్య పనులను పరిశీలించారు. ఆరోగ్యాధికారి డాక్టర్ కె.విశ్వేశ్వర్ రెడ్డి, డిఈఈ క్రిష్ణలత, శానిటేషన్ ఇన్స్‌పెక్టర్ మునిస్వామి, పాల్గొన్నారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

- ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

చెక్ పోస్ట్ వద్ద విధులు నిర్వహించే సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని కర్నూలు జిల్లా ఎక్సైజ్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు అన్నారు. గురువారం ఆయన ఆ శాఖకు సంబంధించిన రాష్ట్ర సరిహద్దు పంచలింగాల చెక్పోస్టును తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. విధుల్లో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. రాష్ట్రేతర మద్యాన్ని అరికట్టడం కోసం వాహనాలను తరచుగా తనిఖీ చేస్తూ ఉండాలన్నారు. పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకోవాలని చెప్పారు. ఆయన వెంట కర్నూలు జిల్లా ఏపీఈఎస్ రాజశేఖర్, చెక్ పోస్ట్ ఇన్స్పెక్టర్ ఆర్.సువర్ణ లత, ఎస్సైలు మల్లికార్జున, శ్రీధర్ రావు, సిబ్బంది శ్రీనివాసులు, జనార్ధన్ తదితరులు ఉన్నారు.

ఆదాయ మార్గాలపై ప్రత్యేక దృష్టి

- అదనపు కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

నగరపాలక సంస్థకు ఆదాయ పెంపునకు మార్గాలను అన్వేషించాలని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ అధికారులకు సూచించారు. గురువారం పాత బస్టాండ్ కెఎంసి పెట్రోల్ పంపు, కింగ్ మార్కెట్ వద్ద మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ను రెవెన్యూ విభాగం అధికారులతో కలిసి పరిశీలించారు. పెట్రోల్ పంపులో పలు రిజిస్టర్లను పరిశీలించి, సిబ్బందితో మాట్లాడారు. గత కొంతకాలంగా నెలకొన్న సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అలాగే పెట్రోల్ పంపు అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. అనంతరం కింగ్ మార్కెట్ వద్ద మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ను పరిశీలించారు. మున్సిపల్ వ్యాపార సముదాయాల్లో అవసరమైన మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ఆర్ఒ జునైద్, ఆర్ఐ శేషాద్రి, ప్రత్యేకాధికారి జిఎం.శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు నదిలో పడి పంజాబ్ వాసి మృతి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

స్నానం చేయడానికి వెళ్లి ప్రమాదవశాత్తు నదిలో పడి పంజాబీ వాసి మృతి చెందిన ఘటన బుధవారం కర్నూలు మండలంలో చోటుచేసుకుంది. కర్నూలు తాలూకా ఎస్ఐ ఎం.నరేష్ వివరాల మేరకు... పంజాబ్ రాష్ట్రం జలంధర్ పట్టణానికి చెందిన దుగ్గాల నరేష్ (42) అనే వ్యక్తి బుధవారం కర్నూలు మండలం పంచలింగాల గ్రామ సమీపంలో తుంగభద్ర నదీతీరంలో ఉన్న గంగమ్మ గుడి వద్ద స్నానం చేసేందుకు వెళ్లారు. అదుపుతప్పి నదిలో పడి, ఈత రాక నీటిలో మునిగి ఉండవచ్చని తెలిపారు. గురువారం నదిలో మృతదేహం తేలియాడుతున్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని బయటికి తీసి విచారణ చేపట్టారు. గత రెండు నెలల క్రితమే పంచలింగాల పరిధిలోని ధూమ్ ఢాబాలో మృతుడు నరేష్ సర్వర్‌గా పనిలో చేరినట్లు నిర్వాహకులు తెలిపారు. మృతదేహాన్ని కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పంచలింగాల విఆర్ఒ మద్దిలేటి, పోలీసులు మాధవ్ కృష్ణ, జనార్ధన్ పాల్గొన్నారు.

భూ సమస్యను పరిష్కరించండి : టిడిపి

ప్రజాశక్తి - మద్దికెర

రీసర్వేలో వచ్చిన భూసమస్యను పరిష్కరించాలని టిడిపి నాయకులు గూడూరు ధనంజయుడు కోరారు. గురువారం రెవెన్యూ సదస్సులో తహశీల్దార్ హుస్సేన్ సాహెబ్‌కు రైతులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో చేసిన రీసర్వేలో తప్పుల వల్ల రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. రైతు సమస్యలతో వచ్చిన అర్జీలను పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరించాలని కోరారు. ఆర్ఐ రవికుమార్, మండల ఇన్‌ఛార్జీ అధికారి ఉమాదేవి, రైతులు పాల్గొన్నారు.

రెండు రోజులపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం : ఎఇ

ప్రజాశక్తి - తుగ్గలి

విద్యుత్ అభివృద్ధి పనులు, మరమ్మతుల దృష్ట్యా రెండు రోజులపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తుగ్గలి విద్యుత్ ఎఇ మహేశ్వర్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. ఈనెల 13, 14న ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తుగ్గలి, జొన్నగిరి సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. ఈ రెండురోజులు రైతులకు సంబంధించిన బోర్లకు తెల్లవారుజాము నుంచే త్రీ ఫేస్ విద్యుత్ సరఫరాను అందజేస్తామని చెప్పారు. రైతులు, వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.


మాట్లాడుతున్న టిజి.వెంకటేష్

క్రీస్తు మార్గం అనుసరణీయం

- మాజీ ఎంపీ టిజి.వెంకటేష్

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

ఏసుక్రీస్తు బోధనలు.. అనుసరించిన మార్గం ప్రతి ఒక్కరికీ అనుసరణీయమని మాజీ ఎంపీ టిజి.వెంకటేష్ తెలిపారు. గురువారం నగరంలోని మౌర్య ఇన్ ఫంక్షన్ హాలులో రాష్ట్ర మంత్రి టిజి.భరత్ ఆధ్వర్యంలో నగరంలోని పాస్టర్లతో క్రిస్మస్ క్యాండిల్ లైటింగ్ సర్వీస్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా టిజి.వెంకటేష్ మాట్లాడారు. ఎవరైతే చేసిన తప్పులను సరిదిద్దుకొని సరైన మార్గంలో నడుచుకుంటారో వారు ఉత్తములని తెలిపారు. తాము అధికారంలో ఉన్నా, లేకున్నా క్రిస్టియన్లకు సహకారం అందిస్తున్నామన్నారు. నగరంలో, చుట్టుపక్కల గ్రామాల్లో ఎన్నో చర్చిల నిర్మాణానికి తమ సంస్థల నుంచి సహాయ, సహకారాలు అందించామని తెలిపారు. గతంలో క్రైస్తవ సంస్థల స్థలాలు ఎన్నో అన్యాక్రాంతమయ్యాయని, తాను కూడా కొన్ని స్థలాలు కొన్నామని అనవసర పుకార్లు పుట్టించారని చెప్పారు. అలాంటివి నమ్మవద్దని కోరారు. తాము ఎస్‌టిబిసి కళాశాలకు చెందిన స్థలాన్ని లీజుకు మాత్రమే తీసుకొని అక్కడ షాపులు, బైబిల్ హోమ్ నిర్మించాలని తలపెట్టామని, ఎవరు ముందుకు రాకపోవడంతో దానిని తిరిగి ఇచ్చేసినట్లు తెలిపారు. పాస్టర్లు ప్రసాద్, శ్యామేల్, ఏసుబాబు, అవిలిన్ బాబు, విఠల్ శెట్టి పాల్గొన్నారు.

పేదలకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

నిఖిలేష్ ఎడ్యుకేషనల్ అకాడమీ చైర్మన్ టి.మద్దిలేటి సతీమణి ఇందిరమ్మ పుట్టినరోజు సందర్భంగా గురువారం కోల్స్ కళాశాలలో పేదలకు చీరలు పంపిణీ చేశారు. బైబిల్ మిషన్ ఎఐ బందెల రాజు అధ్యక్షత వహించారు. ముందుగా క్రిస్మస్ పండగ సందర్భంగా క్యాండిల్ లైటింగ్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఇందిరమ్మ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఫెయిత్ హోమ్ చర్చ్ బిషప్ వి.ధనరాజు, ఎస్‌టిబిసి కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ రజనీపాల్, ఎస్‌టిబిసి కళాశాల ప్రిన్సిపల్ ప్రశాంతి, బ్లెస్సింగ్ యూత్ మిషన్ రాయలసీమ కోఆర్డినేటర్ ఆర్ఎ.స్వామి, స్త్రీల సమాజం సిసి చర్చి పెద్దలు, సుగుణ బైబిల్‌లోని వాఖ్యాలను చదివి వినిపించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.


క్యాండిల్ లైటింగ్ చేపడుతున్న సభ్యులు

బాధిత కుటుంబాలకు ఉపాధి కల్పించాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు


కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

మున్సిపాలిటీలో గత ఐదేళ్లుగా అనారోగ్యంతో మృతి చెందిన 12 మంది పారిశుధ్య కార్మికుల కుటుంబాలకు ఉపాధి కల్పించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు, తాలూకా కార్యదర్శి బి.రాముడు డిమాండ్ చేశారు. గురువారం సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత ఐదేళ్లలో మున్సిపాలిటీలో వివిధ అనారోగ్య కారణాలతో మృతి చెందారని, వారి కుటుంబాలకు ఉపాధి కల్పించాలని కోరారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు జె.నాగరాజు, కె.ఇస్మాయిల్, మునీంద్ర, బాష, ఖాజా, రంగస్వామి, మృతుల కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జీ సహకారంతో మహర్దశ

- తెలుగు యువత జిల్లా మాజీ అధ్యక్షులు మేకల రవి యాదవ్

ప్రజాశక్తి - చిప్పగిరి


సిసి రోడ్డు పనులను పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు

టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ సహకారంతో మహర్దశ పట్టిందని తెలుగు యువత జిల్లా మాజీ అధ్యక్షులు మేకల రవి యాదవ్ తెలిపారు. గత మూడు రోజుల నుంచి నేమకల్లు నల్లంబావి వీధుల్లో జరుగుతున్న నిర్మాణ పనులను గురువారం అధికారులతో కలిసి టిడిపి నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నేమకల్లు గ్రామం నల్లంబావి వీధుల్లో ఎన్నో ఏళ్ల నుంచి సిసి రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడేవారని తెలిపారు. సమస్యను కూటమి ప్రభుత్వం పరిష్కరిస్తూ ఉపాధి నిధులు రూ.20 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణాలు చేపడుతోందని చెప్పారు. మండలంలోని చాలా గ్రామాల్లో రూ.1.80 కోట్ల నిధులతో ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ సహకారంతో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామాల్లో ప్రాధాన్యత ఉన్న రహదారాలను, డ్రెయినేజీతో కూడిన సిసి రోడ్డు నిర్మాణాలు చేపట్టిందని చెప్పారు. అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించి సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. కొత్త సంవత్సరంలో విడతలవారీగా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

20న బహిరంగ వేలం

- ఎంపిపి రంగమ్మ, డిఎల్‌పిఒ వీరభద్రప్ప

ప్రజాశక్తి - ఆలూరు


అధికారుల సమక్షంలో లాటరీ తీస్తున్న సిబ్బంది

ఆలూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎన్ఆర్‌యుఎం నిధులు రూ.80 లక్షలతో నిర్మించిన మండల పరిషత్ వాణిజ్య సముదాయ 18 భవనాలకు ఒక సంవత్సరానికి లీజ్ పద్ధతిన ఈనెల 20న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎంపిపి రంగమ్మ, డిఎల్‌పిఒ వీరభద్రప్ప తెలిపారు. గురువారం వారు మాట్లాడారు. ఆలూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి రంగమ్మ ఆధ్వర్యంలో 18 షాపులకు గాను ఎస్సీలకు-3, ఎస్టీ-1, బీసీ-5, మిగిలిన షాపులకు జనరల్ కేటగిరీలో నిర్ణంచినట్లు తెలిపారు. ఏ షాపు ఏ కేటగిరీకి అన్నది బహిరంగంగా లాటరీ పద్ధతిలో నిర్ణయించినట్లు చెప్పారు. కింద ఉన్న షాపులకు సర్కార్ వారి పాట రూ.3వేలు, పైన ఉన్న షాపులకు రూ.2వేలు నిర్ణయించినట్లు తెలిపారు. బహిరంగ వేలం పాటలో పాల్గొనేవారు మండలంలో నివాసం ఉండాలని, ముందుగానే రూ.30 వేలు డిపాజిట్ చేయాలని చెప్పారు. పాట దక్కించుకున్న వారు మరో షాపు పాట పాడాలని అనుకుంటే మరో రూ.30 వేలు డిపాజిట్ చేయాలన్నారు. వేలం పాట తర్వాత ఏడాదికి బాడుగ లెక్కించి డిపాజిట్ పోగా మిగిలిన మొత్తం చెల్లిస్తేనే ఫిబ్రవరి 1న షాపులను కేటాయిస్తామని తెలిపారు. ఎంపిడిఒ సూర్యనారాయణ, ఇన్‌ఛార్జీ ఇఒఆర్‌డి ప్రభాకర్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రమాదేవి, ఎంపిపి తనయుడు వీరేష్ పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప స్వాముల విలక్కీ పూజ

ప్రజాశక్తి- దేవనకొండ



దేవనకొండలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో గురువారం విలక్కీ పూజ నిర్వహించారు. స్వామివారి ఆలయంలో స్వామి వారి విగ్రహానికి ప్రత్యేక అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామివారి చిత్రపటాల ముందు బాలికలు కలశాలు చేతపట్టి ప్రధాన రహదారుల గుండా అయ్యప్ప స్వాములు ఊరేగింపు నిర్వహించారు. జడ్‌పిటిసి కిట్టు, వెంకట సాయి ట్రేడర్స్ ప్రతినిధులు శివ పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఆలూరు

రాష్ట్రవ్యాప్తంగా పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సిపిఎం సీనియర్ నాయకులు కెపి.నారాయణస్వామి డిమాండ్ చేశారు. గురువారం సిపిఎం ఆలూరు ప్రాంతీయ కమిటీ ఆధ్వర్యంలో నారాయణ స్వామి అధ్యక్షతన అంబేద్కర్ సర్కిల్‌లో విద్యుత్ బిల్లులను కాలుస్తూ నిరసన తెలిపారు. సిపిఎం జిల్లా నాయకులు పి.హనుమంతు, నాయకులు షాకీర్ మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వ విధానాలనే కూటమి ప్రభుత్వం అవలంబిస్తోందని తెలిపారు. వైసిపి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచితే రాష్ట్రవ్యాప్తంగా 'బాదుడే.. బాదుడు' అని ప్రచారం చేసి ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ట్రూ అప్ చార్జీలు, సర్దుబాటు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ పేరుతో విద్యుత్ చార్జీలను పెంచిందని విమర్శించారు. అసలు కంటే కొసరే అధికంగా జనంపై భారాలు పడుతున్నాయని తెలిపారు. అక్టోబర్‌లో వచ్చిన బిల్లు కంటే 40 శాతం బిల్లులు అధికంగా రావడం దారుణమని, కూటమి ప్రభుత్వం పట్ల ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేశారని మండిపడ్డారు. అధికారంలో లేనప్పుడు ఒక మాట.. అధికారంలోకి వచ్చాక మరో మాట మాట్లాడం సరికాదన్నారు. ఈ భారాలను తక్షణమే ఉపసంహరించుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. సిపిఎం ఆలూరు ప్రాంతీయ కమిటీ సభ్యులు కె.కృష్ణ, మైనా, అగ్రహారం ఈరన్న, ఆటో యూనియన్ నాయకులు శీను, నాగరాజు, శివ పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

'సూర్య ఘర్'తో అనేక ప్రయోజనాలు

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - ఆదోని



ఆదోనిలో గోడపత్రికను విడుదల చేస్తున్న సబ్ కలెక్టర్

ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన ద్వారా అనేక ప్రయోజనాలు పొందవచ్చని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని విఎస్‌బి ఫంక్షన్ హాలులో 'సూర్య ఘర్ యోజన' పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ హాజరై మాట్లాడారు. సూర్య ఘర్ యోజన పొందడం ద్వార పర్యావరణాన్ని కాపాడవచ్చని తెలిపారు. అనంతరం ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన ద్వారా సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకుని, 3 వాట్లు సద్వినియోగం చేసుకొని రూ.78 వేల వరకు రాయితీ పొందిన శ్రీనివాసులు, భద్ర మూర్తి, గోవిందరాజు, పురుషోత్తంకు సబ్ కలెక్టర్ శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా ఈనెల 14 నుంచి 20 వరకు జరిగే కార్యక్రమాలకు సంబంధించి గోడపత్రికను విడుదల చేశారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణ, విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హరి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (టెక్నికల్) ఓబులేసు, అసిస్టెంట్ డిఇ పురుషోత్తం, ట్రాఫిక్ సిఐ గంటా సుబ్బారావు ఉన్నారు. **దేవనకొండ** విద్యుత్ సబ్ స్టేషన్ ఆవరణలో సూర్య ఘర్ యోజన పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల విద్యుత్ ఇంజినీర్ రవీంద్ర మాట్లాడుతూ... సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోవడం ద్వారా విద్యుత్ బిల్లులు ఆదా అవతాయన్నారు. లైన్ ఇన్‌స్పెక్టర్ వెంకప్ప పాల్గొన్నారు.


దేవనకొండలో..

రోడ్డెక్కిన మున్సిపల్ కాంట్రాక్టు ఉద్యోగులు

- మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రదర్శన

ప్రజాశక్తి - ఆదోని

తమ సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ ఇంజినీరింగ్ వాటర్ సప్లయి విభాగం కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు రోడ్డెక్కారు. గురువారం ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజినీరింగ్ సెక్షన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదోని మున్సిపల్ కార్యాలయం నుంచి కోట్ల విజయభాస్కర్ రెడ్డి సర్కిల్ వరకు ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కె.సోమన్న, పీరాసాబ్, అహ్మద్, జికె.రామాంజనేయులు మాట్లాడారు. చాలీచాలని వేతనాలతో దశాబ్ద కాలంగా రెగ్యులర్ ఉద్యోగులకు ధీటుగా పని చేస్తున్నా పట్టించుకునే వారే లేరన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా తమ జీవితాలు మారడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రూ.13 వేల వేతనంలో పిల్లల స్కూల్ ఫీజులు, ఇంటి అద్దెలు పోగా మిగిలిన మొత్తంతో నెల అంతా ఎలా బతికేది అంటూ నినాదాలు చేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పదేళ్ల సర్వీసు పూర్తయిన వారిని రెగ్యులర్ చేయాలని కోరారు. చర్చలకు పిలిచి తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ పెద్దలు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా సేవలు నిలిపివేసి సమ్మెలోకి వెళ్లాల్సి వస్తుందని హెచ్చరించారు. ఉద్యోగ, కార్మికులు కర్రెప్ప, కైలాష్, శివరాం, కృష్ణమూర్తి, కెపి.చంద్ర, వీరేష్, భరత్, శివ, షాషావలీ ఉన్నారు.

కార్మికులకు బుట్టా రేణుక సంఘీభావం

ఎమ్మిగనూరు : మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్న ఇంజినీరంగ్ కార్మికులకు గురువారం వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక సంఘీభావం తెలిపారు. ఆమె మాట్లాడుతూ... సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇవ్వాలన్నారు. ఇంజినీరింగ్ కార్మికులను క్రమబద్ధీకరణ చేయాలన్నారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ నజీర్ అహ్మద్, పట్టణ అధికార ప్రతినిధి సునీల్ కుమార్, కామర్తి నాగేశప్ప, కొమ్ము రాజశేఖర్, పాల శ్రీనివాసరెడ్డి, మాచాని వెంకటేష్, డిష్ కేశవరెడ్డి, ఎంకె.శివప్రసాద్, సుధాకర్, మహబూబ్ బేగ్, వడ్డే వీరేష్, చంద్ర శేఖర్, శ్రీధర్ రెడ్డి, బాబాఖాన్, రసూల్, హనీఫ్, పాపయ్య, నరసింహులు, అల్తాఫ్, సయ్యద్ చాంద్, ఫయాజ్, మాచాని రఘు పాల్గొన్నారు.



ఆదోనిలో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ ఉద్యోగులు


ఎమ్మిగనూరులో సంఘీభావం తెలుపుతున్న బుట్టా రేణుక

నూతన గృహాన్ని ప్రారంభించిన శ్రీనివాసులురెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

తెలుగు యువత నాయకులు గణేకంటి (సున్నం) రామకృష్ణ నూతన గృహాన్ని టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాసులు రెడ్డి ప్రారంభించారు. గురువారం స్థానిక రామచంద్ర నగర్ కాలనీలో నిర్మించిన ఇంటిని టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి ఆధ్వర్యంలో రిబ్బన్ కట్ చేసి ప్రవేశించారు. అంతకుముందు ముఖ్య అతిథిగా హాజరయిన శ్రీనివాసులురెడ్డిని, ప్రముఖులను శాలువా, పూలమాలలతో ఆహ్వానించారు. క్లస్టర్ ఇన్‌ఛార్జీ ఎల్లారెడ్డి, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు మాధవరం అమర్‌నాథ్ రెడ్డి, యువ నాయకులు మాధవరం కృష్ణ మోహన్ రెడ్డి, తెలుగు యువత జిల్లా మీడియా కోఆర్డినేటర్ విజయ రామిరెడ్డి పాల్గొన్నారు.


గృహాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాసులురెడ్డి

మహాసభలను జయప్రదం చేయండి : సిపిఎం

ప్రజాశక్తి - కౌతాళం

సిపిఎం మండల 7వ మహాసభను జయప్రదం చేయాలని సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య, మండల కన్వీనర్ బి.ఈరన్న, మారయ్య కోరారు. గురువారం వారు మాట్లాడారు. ఈనెల 15న ఎరిగేరి గ్రామంలో మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభలకు జిల్లా, మండల నాయకులు హాజరవుతారని చెప్పారు. పార్టీ కార్యకర్తలు, సానుభూతి పరులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

సాగునీటి సమస్యలపై దశలవారీ ఆందోళన

- సిపిఎం జిల్లా నాయకులు వీరశేఖర్

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి సమస్యలపై రాబోయే రోజుల్లో దశలవారీ ఉద్యమాలు చేపడతామని సిపిఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక సిఐటియు కార్యాలయంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు అశోక్, యూసుఫ్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరశేఖర్ మాట్లాడారు. మండలంలో హంద్రీనీవా పెండింగ్ పనుల నేపథ్యంలో రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందడం లేదని తెలిపారు. పంట కాలువల నిర్మాణం.. నాయకులకు ప్రజలను మభ్యపెట్టే వాగ్దానంగా మారుతోందని చెప్పారు. పంట కాలువల నిర్మాణం పూర్తి చేసి రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హంద్రీనీవా ప్రధాన కాలువ పనులు కరివేముల నుంచి తెర్నేకల్ వరకు, కప్పట్రాళ్ల గ్రామ రెవెన్యూలోను పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు. గుండ్లకొండ దగ్గర స్లూయిజ్ ఏర్పాటు చేసి కోటకొండ, మాచాపురం వరకు సాగునీరు ఇవ్వాలని, పది వేల ఎకరాలకు పైగా సాగునీరందే విధంగా ఆ ప్రాంతంలో 12 చెరువులకు నీరు నింపే అవకాశాన్ని ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని విమర్శించారు. గుండ్లకొండ దగ్గర స్లూయిస్ ఏర్పాటుకు నిధుల కేటాయించి పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కోటకొండ నుంచి బేతపల్లి రోడ్డు, పుల్లాపురం, తెర్నేకల్లు, కప్పట్రాళ్ల, బండగట్టు రోడ్డు, గ్రామీణ ప్రాంతాల్లో లింకు రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, వాటిని పూర్తి చేయాలని కోరారు. మండలంలో తెర్నేకల్లులో కళాశాల ఏర్పాటు, దేవనకొండలో హాస్టళ్ల నిర్మాణం చేపట్టాలని, కోటకొండలో పిహెచ్‌సి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో సాగు, తాగునీరు, ఉపాధి, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలపై ప్రజల సహకారంతో పోరాటం చేస్తామని తెలిపారు.


మాట్లాడుతున్న వీరశేఖర్

మండల కమిటీ ఎన్నిక : బుధవారం జరిగిన రెండో మండల మహాసభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కెవి.నారాయణ ఆధ్వర్యంలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా వీరశేఖర్, కమిటీ సభ్యులుగా అశోక్, సూరి, యూసుఫ్ బాష, మహబూబ్ బాషను ఎన్నుకున్నారు.

'అనాథ పిల్లలకు పింఛను'పై హర్షం

ప్రజాశక్తి - మంత్రాలయం



అనాథ పిల్లలకు పింఛను ఇస్తానని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇవ్వడంపై జైభీమ్ ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఆయన మండలంలోని వి.తిమ్మాపురం గ్రామంలో మాట్లాడారు. రాష్ట్రంలో తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలకు పింఛను ఇవ్వాలని పోస్టు కార్డు ఉద్యమం ద్వారా గత 20 ఏళ్ల నుండి ఉద్యమించి కలెక్టర్, ఆర్‌డిఒ, తహశీల్దార్‌కు వినతి పత్రాలు ఇచ్చినట్లు తెలిపారు. తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలను గుర్తించి పింఛను ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పందించి కలెక్టర్లు, క్యాబినెట్ సదస్సులో చెప్పినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతగా త్వరలో ఒక కార్యక్రమాన్ని భారీ ఎత్తున ఏర్పాటు చేస్తామని చెప్పారు.

విజిలెన్స్‌కు కొత్త ఇన్‌స్పెక్టర్లు

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

కర్నూలు ఉమ్మడి జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ నూతన ఇన్‌స్పెక్టర్లుగా యుగంధర్ బాబు, పవన్ కిశోర్ బాధ్యతలు చేపట్టారు. బుధవారం ఆ శాఖ ఎస్పీ చౌడేశ్వరిని మర్యాదపూర్వకంగా కలిసి రిపోర్టు చేశారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ ఆదేశాల మేరకు ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలయ్యేలా.. ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం కాకుండా ఉండేందుకు తగిన చర్యలు చేపడతామని వారు తెలిపారు.

వంద ఉత్తీర్ణత సాధించాలి

- జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి పరమేశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

వెనుకబడిన విద్యార్థులు కూడా వంద ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని జిల్లా వృత్తి విద్యా శాఖ అధికారి పరమేశ్వర్ రెడ్డి అన్నారు.. ప్రభుత్వ జూనియర్ కళాశాల టౌన్ కర్నూలులో సంకల్ప్-2025లో భాగంగా వంద ఉత్తీర్ణత సాధించడానికి మధ్యాహ్నం మూడు గంటల నుండి ఐదు గంటల వరకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. ఈ స్టడీ అవర్స్‌ను జిల్లా వృత్తి విద్య అధికారి పరమేశ్వర్ రెడ్డి, జిల్లా ఏజీఎంఒ సుంకన్న తనిఖీ చేశారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

- ప్రత్యేకాధికారి చిరంజీవి

ప్రజాశక్తి - నందవరం

భూసమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ స్పెషల్ అధికారి సి.చిరంజీవి, నోడల్ అధికారి జివి.రమణారెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని హాలహర్వి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వారు ముఖ్యఅతిథులుగా హాజరయి మట్లాడారు. గత ప్రభుత్వంలో భూ రీసర్వేలో తలెత్తిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం టిడిపి మండల నాయకులు రైస్‌మిల్ నారాయణరెడ్డి మాట్లాడారు. రైతులకు పెద్దపీట వేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పాలన సాగిస్తున్నారని తెలిపారు. రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం అధికారులు 49 వినతులు స్వీకరించారు. టిడిపి ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు దావీదు, టిడిపి గ్రామ అధ్యక్షులు నాగరాజు, డిప్యూటీ తహశీల్దార్ మహేష్, ఆర్ఐ జెర్మియా, విఆర్ఒ నతానియేలు, మాజీ సర్పంచి దాసు, టిడిపి నాయకులు జగన్నాథ్ రెడ్డి, ఎర్రం నాయుడు, గోవిందు, వెంకటరాముడు, జి.దుబ్బన్న పాల్గొన్నారు. **కౌతాళం** మండలం వల్లూరు గ్రామంలో గ్రామసభ నిర్వహించి రైతుల నుంచి వినతులు స్వీకరించారు. తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి అడివప్ప గౌడ్, డిప్యూటీ తహశీల్దార్ రజనీకాంత్ మాట్లాడారు. సర్పంచి పంపాపతి, గ్రామ నాయకులు ఆది బసవ గౌడ్ పాల్గొన్నారు. **హోళగుంద** మండలం హెబ్బటం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహశీల్దార్ సతీష్ మాట్లాడుతూ... గ్రామంలో 23 దరఖాస్తులు భూ సమస్యలకు సంబంధించినవి కాగా.. 38 కుల ధ్రువీకరణ పత్రాలకు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయన్నారు. డిప్యూటీ తహశీల్దార్ నిజాముద్దీన్, విఆర్ఒ ప్రహ్లాద పాల్గొన్నారు. **ఆలూరు** తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ గోవింద్ సింగ్ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మ్యూటేషన్, డిజిటల్ కీ, సర్వే నెంబరు ఆన్ లైన్‌లో లేకపోవడం వంటి సమస్యలను రైతులు తహశీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. డిప్యూటీ తహశీల్దార్ విజయ్ కుమార్, మండల సర్వేయర్ అరుణ జ్యోతి పాల్గొన్నారు.


కౌతాళంలో వినతులు స్వీకరిస్తున్న అధికారులు


హోళగుందలో వినతులు స్వీకరిస్తున్న అధికారులు

ప్రతి ఇంటికీ సభ్యత్వం : టిడిపి

ప్రజాశక్తి - ఆదోనిరూరల్

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ప్రతి ఒక్కరికీ సభ్యత్వం ఇచ్చేలా చూస్తామని టిడిపి సీనియర్ నాయకులు, వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మదిరే సూరం భాస్కర్ రెడ్డి తెలిపారు. గురువారం ఆరెకల్ గ్రామంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. అంతకుముందు సూరం భాస్కర్ రెడ్డి బృందానికి మాజీ ఎంపిటిసి రాఘవేంద్ర, అల్లారెడ్డి, రాఘవేంద్ర, భీమన్న, ఆనంద్, నాగరాజు, ఈడిగి లక్ష్మన్నలు స్వాగతం పలికారు. సౌదీ రావుఫ్, బుద్ధారెడ్డి, మాజీ కౌన్సిలర్ రామచంద్ర, చిన్న గోనెహాల్ గోపాల్ రెడ్డి, ఫక్రుద్దీన్, మాజీ కౌన్సిలర్ మల్లికార్జున, సోమశేఖర్ రెడ్డి, మల్లేశ్వరప్ప, మద్దికేర రామకృష్ణ, ఎమ్‌డి.హుస్సేన్, కారుమంచి, నారాయణపురం షాషావలీ, ఇస్వి శ్రీనివాసులు, బిటి.శీన, హోసల్లి రఘునాథ్ రెడ్డి, మదిరే మాజీ సర్పంచి గోవిందు, తిక్కన్న, సలకలకొండ శీన, విరుపాపురం బద్రి రమేష్, షేకన్న, తిమ్మప్ప, మదిరే శ్రీనివాస్, నాగరాజ్, పరమేష్, బడేసాబ్, మల్లేష్, ప్రేమ్ కుమార్ ఉన్నారు.



మాట్లాడుతున్న భాస్కర్ రెడ్డి

సమన్వయంతో అభివృద్ధి లక్ష్యాలు సాధించాలి

- ఎంపిడిఒ సుబ్బరాజు

ప్రజాశక్తి - కౌతాళం

ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో స్థానిక సమీకృత అభివృద్ధి లక్ష్యాలను సాధించాలని ఎంపిడిఒ సుబ్బరాజు పేర్కొన్నారు. గురువారం సమీకృత అభివృద్ధి లక్ష్యాలపై ఎంపిడిఒ కార్యాలయంలో శిక్షణ తరగతులు ప్రారంభించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారం కోసం ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. విస్తరణ అధికారి యోగేశ్వర్ రెడ్డి, పరిపాలన అధికారి సత్యన్న, అదనపు కార్యక్రమ అధికారి మాధవ శంకర్, ఎపిఎం ఫరీద్ ఖాన్ పాల్గొన్నారు. **గోనెగండ్లలో** ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, విఆర్ఒలు, డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సిబ్బందికి శిక్షణ తరగులను ఎంపిడిఒ మణిమంజరి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.... గ్రామాల్లో 9 అంశాలను ఎంపిక చేసుకుని అన్ని రంగాల్లోనూ గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలన్నారు. నీటి సమస్య, పేదరికం లేకుండా ఉపాధి అవకాశాలు మెండుగా కల్పించి గ్రామాలు అభివృద్ధి చెందేలా పనిచేయాలన్నారు. ట్రైనర్లు విస్తరణ అధికారి అనంత శయన, సతీష్, ఎఇలు శివశంకర్, శ్రీనివాసులు రెడ్డి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జరీనా, సుధాకర్, ఎపిఎం జయన్న శిక్షణ ఇచ్చారు. **తుగ్గలి** మండలంలోని అన్ని శాఖల మండలస్థాయి అధికారులు, సర్పంచులు, విఆర్ఒలు, సర్వేయర్లు, అగ్రికల్చర్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపిపి ఎర్ర నాగప్ప, ఎంపిడిఒ కె.విశ్వమోహన్ మాట్లాడారు. **కోడుమూరు** ఎంపిడిఒ కార్యాలయంలో శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఎంపిడిఒ రాముడు, ఎపిఎం సుబ్బయ్య, ఎపిఒ మోద్దీన్ బాష, ఎంఇఒ వసంత బాయి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ప్రసాద్ పాల్గొన్నారు. **చిప్పగిరి** మండల కార్యాలయంలో 'గ్రామ స్వరాజ్య అభియాన్' కింద సర్పంచులకు, అధికారులకు రెండు రోజులు శిక్షణ తరగతులను ప్రారంభించారు. మొదటి రోజు శిక్షణ తరగతులను ఎంపిడిఒ అల్లా బకాష్ ప్రారంభించారు. ఎంపిడిఒ అల్లా బకాష్, ఎంఇఒ సావిత్రమ్మ, ఆర్‌డబ్ల్యుసి ఎఇ మల్లికార్జున్ రెడ్డి, ఇఒఆర్‌డి బాలన్న, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ప్రసూన మాట్లాడారు. సర్పంచి మల్లమ్మ, పరిపాలన అధికారి శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ రెడ్డి, అస్పిరేషనల్ అధికారి నరసింహ, సిహెచ్ఒ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు సురేంద్రనాథ్, జయరాం నాయక్, సుధీర్, నరసింహులు, ప్రమీల పాల్గొన్నారు.


కౌతాళంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ



గోనెగండ్లలో మాట్లాడుతున్న ఎంపిడిఒ



తుగ్గలిలో మాట్లాడుతున్న ఎంపిపి ఎర్ర నాగప్ప

వెండి కవచం సమర్పణ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

శ్రీనీలకంఠేశ్వర స్వామి నందీశ్వరునికి వెండి కవచాన్ని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక, బుట్టా శివ నీలకంఠ దంపతులు సమర్పించారు. గురువారం శ్రీనీలకంఠేశ్వర స్వామి దేవాలయంలో వైసిపి బుట్టా రేణుక, శివ నీలకంఠ దంపతులను స్వాగతించి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవాలయంలో ఉన్న నందీశ్వరునికి మూడు కిలోల వెండి కవచాన్ని సమర్పించారు. కామర్తి నాగేశప్ప, మాచాని వెంకటేష్, ఎంకె.శివప్రసాద్, సునీల్ కుమార్, మహబూబ్ బేగ్, గడ్డం నారాయణరెడ్డి, విరుపాక్షి రెడ్డి, మాచాని రఘు, సయ్యద్ చాంద్, పాల్గొన్నారు.

కృత్రిమ కాలు కోసం రూ.50 వేల విరాళం

మండలంలోని మసీదుపురం గ్రామానికి చెందిన అబ్బిలి హనుమంతు మనువడు అబ్బిలి రాముడు రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయారు. రాముడుకు కృత్రిమ కాలు కోసం రూ.50 వేల ఆర్థిక సహాయం బుట్టా రేణుక, బుట్టా శివ నీలకంఠ అందజేశారు. మసీదుపురం గ్రామ నాయకులు రాముడు, ఆంజనేయులు, సుంకన్న, నరసింహులు, తిప్పన్న పాల్గొన్నారు.